
వంతెన మధ్యలో కంకరతో ఉన్న రోడ్డు..


ప్రారంభంలో ప్రమాదకరంగా ఇసుక, మట్టి కుప్పలు

# పూర్తికాని పనులు.. అయినా రాకపోకలు

మండలంలోని వేంపల్లి వంతెన పనులు పూర్తి కాకముందే, ప్రారంభానికి నోచుకోక ముందే వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. 2015-16లో నిధులు మంజూరు కాగా గుత్తేదారు బ్రిడ్జి పనులు ప్రారంభించారు. తదనంతరం పనుల్లో జాప్యం కారణంగా పూర్తికాలేదు. ఈ ఏడాది నుంచి వంతెనపై అనధికారికంగా వాహనదారులు ప్రయాణిస్తున్నారు. వంతెన ప్రారంభంలో, మధ్యలో, చివర రహదారిలో కంకర, మట్టి కుప్పలు అలాగే ఉన్నాయి. ప్రమాదకరంగా ఉన్నప్పటికీ దుమ్ము, ధూళిలోనూ రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, సిర్పూర్(టి)

# జలకాలాట.. ఆరోగ్య బాట

**✷ ఈతపై పెరుగుతున్న ఆదరణ ✷ ఇతర దేశాల్లో పాఠ్యాంశంగా బోధన**


ఆదిలాబాద్ ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో ఈత కొలనులో చిన్నారుల సాధన

**న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం :** రోజూ ఈతకు వెళితే శరీరానికి చక్కటి వ్యాయామం అవుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా ఇటీవల ఉమ్మడి జిల్లాలో ఈతకు ఆదరణ పెరుగుతోంది. కొన్ని ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో మినీ ఈత కొలనులు అందుబాటులో ఉంచి పిల్లలకు శిక్షణ ఇస్తున్నాయి. ఆరోగ్యంపై స్పృహ ఉన్న వారు నేర్చుకుంటున్నారు. వినోదాన్ని, ఆహ్లాదాన్ని పెంపొందించే ఈత విశ్వ క్రీడల్లో అత్యంత జనాదరణ పొందింది. ఇతర దేశాల్లో పాఠ్యాంశంగా బోధిస్తున్నారు. ఈతతో చేకూరే ప్రయోజనాలపై ప్రత్యేక కథనం.

**ఉమ్మడి జిల్లాలో ఈత కొలనులు**
- ఆదిలాబాద్: 3
- నిర్మల్ : 1
- కుమురం భీం:1
- మంచిర్యాల 4

### ఇతర దేశాల్లో..

ఇతర దేశాల్లో ప్రతి ఒక్కరికి ఈత తప్పనిసరిగా వచ్చి ఉండాలనే నిబంధన, చట్టం ఉంది. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఈతలో శిక్షణ ఇస్తున్నారు.

✷ ఇంగ్లాండ్‌లోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు తప్పనిసరిగా ఈత నేర్పిస్తున్నారు. జాతీయ పాఠ్య ప్రణాళికలో శారీరక విద్య చట్టాన్ని పక్కాగా అమలు చేస్తున్నారు.

✷ ఆస్ట్రేలియాలో ఎక్కువగా బీచ్ సంస్కృతి ఉంది. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఈత నేర్పిస్తామని ధ్రువీకరణ పత్రం రాసి ప్రభుత్వానికి ఇవ్వాలని నిబంధన ఉంది.

✷ యూఎస్‌లోని పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతుల విద్యార్థులు ఈత నేర్చుకోవడం తప్పనిసరి చేసింది.

నాలుగు విధాలుగా ఈదవచ్చు. ఫ్రీ స్టైల్, బటర్‌ఫ్లై, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్.

### బటర్‌ఫ్లై..



అత్యంత కష్టతరమైన ఈత బటర్‌ఫ్లై. నేర్చుకోవడానికి దాదాపు నెలరోజులు పడుతుంది. సీతాకోకచిలుక రెక్కలు ఆడించినట్లుగా రెండు చేతులతో నీటిని లాగుతూ ముందుకు కదలాలి. గంట బటర్‌ఫ్లై ఈత కొడితే 988 కెలరీలు ఖర్చవుతాయి.

### బ్రెస్ట్ స్ట్రోక్..



నీటిలో కప్ప ఈదినట్లుగా ఉంటుంది బ్రెస్ట్ స్ట్రోక్ ఈత. రెండు కాళ్లతో నీటిని వెనక్కి నెట్టుతూ, రెండు చేతులు వేగంగా ఛాతి వైపు లాగుతూ ముందుకు వెళ్లే ప్రక్రియ. గంట పాటు సాధన చేస్తే 737 కెలరీలు ఖర్చవుతాయి.

### ఫ్రీ స్టైల్..



దీనిని సంప్రదాయ ఈత అని కూడా అంటారు. రెండు వారాల్లో నేర్చుకోవచ్చు. గంట పాటు ఫ్రీ స్టైల్ విధానంలో ఈదితే 590-931 కెలరీలు ఖర్చు అవుతాయి.

### బ్యాక్ స్ట్రోక్..



నేలపైన పడుకున్నట్లుగా నీటిపైన తేలుతూ ఈత కొట్టేదే బ్యాక్ స్ట్రోక్. రెండు నెలల్లో నేర్చుకోవచ్చు. ముఖం, కళ్లు ఆకాశం వైపు చూస్తూ శ్వాసను ఏకాగ్రతతో మెల్లగా వదలాలి, తీసుకోవాలి. ఈ క్రమంలో రెండు కాళ్లు చేతులతో నీటిని నెట్టాలి. గంట పాటు చేస్తే 500 కెలరీలు ఖర్చవుతాయి.

### ఒత్తిడి దూరం..

- డా.క్రాంతికుమార్, ఎండీ జనరల్ ఫిజిషియన్



ఈత ఆరోగ్యానికి చాలా మంచిది. క్రమం తప్పకుండా రోజూ ఈత సాధనతో శరీరానికి మంచి వ్యాయామం లభిస్తుంది. శ్వాస సంబంధిత వ్యాధులు దరికి చేరవు. హృదయ స్పందన నియంత్రణలో ఉంచుతుంది. శరీరంపైన ఒత్తిడిని తగ్గిస్తుంది.

**ఉమ్మడి జిల్లాలో గడిచిన ఏడేళ్లలో ఈత రాక 86 మంది మృత్యువాత పడ్డారు.**

● ఊబకాయం ఉన్నవారికి చక్కటి వ్యాయామం.

**వీరు దూరంగా ఉండాలి :** ఆస్తమా ఉన్నవారు, శస్త్ర చికిత్స అయిన వారు, చర్మ వ్యాధులతో బాధపడుతున్నవారు, అవయవ మార్పిడి చేసుకున్నవారు దూరంగా ఉండాలి

### ఆసక్తి చూపుతున్నారు..: - కొమ్ము కృష్ణ, ఈత శిక్షకుడు, ఆదిలాబాద్



వేసవి నెలవుల్లో మాత్రమే ఈతకు వచ్చేవారు. ఇప్పుడు నేర్చుకునేవారి సంఖ్య పెరుగుతోంది. రోజూ ఉదయం, సాయంత్రం 50 మంది శిక్షణకు వస్తున్నారు. కొత్తవారు, సాధకులు తప్పనిసరి ఈత శిక్షకులు, నిపుణుల పర్యవేక్షణలోనే నీటిలోకి దిగాలి. పూర్తి పట్టు సాధించాక ఒంటరిగా 8 అడుగుల నీటి లోతులోకి వెళ్లాలి. ధైర్యం ఉన్నవారే ఈతలో రాణించగలుగుతారు.

### ఇలా చేస్తే ప్రయోజనాలెన్నో..

- ● నాలుగు గంటల పాటు నడవడం వల్ల ఎన్ని కెలరీలు ఖర్చవుతాయో గంటపాటు ఈత కొట్టడంతో అంతకన్నా ఎక్కువ కెలరీలు ఖర్చు అవుతాయి.
- ● చక్కటి నిద్ర పడుతుంది.
- ● జీర్ణవ్యవస్థ మెరుగుపడి ఆకలి బాగా అవుతుంది.
- ● రక్తపోటు, మధుమేహం నియంత్రణలో ఉంటాయి.
- ● గుండె, ఊపిరితిత్తులు, రక్తప్రసరణ, మూత్రపిండాల పనితీరు మెరుగుపడుతుంది.

# న్యాయ సహాయం కోసం సంప్రదించొచ్చు


కలెక్టర్ వెంకటేష్ దోత్రేతో కలిసి కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.వి.రమేశ్

**ఆసిఫాబాద్, న్యూస్‌టుడే :** ఉచిత న్యాయ సహాయం, సలహాల కోసం జాతీయ సేవాధికార సంస్థ టోల్ ఫ్రీ నంబర్ 15100 లో సంప్రదించొచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.వి.రమేశ్ తెలిపారు. శనివారం ట్రోల్ ఫ్రీ నం.తో పాటు దరఖాస్తు చేసుకునే వెబ్‌సైట్ https:///www.nalsa.gov.insams కు సంబంధించిన కరపత్రాలను వేరు వేరుగా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కె.యువరాజాలతో కలిసి ఆవిష్కరించారు. అవసరమున్న వారు వీటి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి సారిక పాల్గొన్నారు.

# పోలీసులకు వ్యాసరచన పోటీలు


పరీక్ష రాస్తున్న పోలీసులు

**ఆసిఫాబాద్, న్యూస్‌టుడే :** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని.. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు ఆదేశాలతో పోలీసు అధికారులు, సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కేటగిరీ-1లో కానిస్టేబుల్ స్థాయి నుంచి ఏఎస్సై వరకు 'సమాజంలో పోలీసు ప్రతిష్ఠను మెరుగు పరచడంలో నా పాత్ర', కేటగిరీ-2లో ఎస్సై, ఆ పై స్థాయి అధికారులకు 'దృఢమైన శరీరంలో దృఢమైన మనసు' అంశాలపై నిర్వహించిన పోటీల్లో మొత్తం 26 మంది పాల్గొని ప్రతిభను ప్రదర్శించినట్లు డీసీఆర్‌బీ సీఐ కేశవులు పేర్కొన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి ఈ నెల 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన బహుమతులు, ప్రశంసా పత్రాలు అందిస్తారని చెప్పారు.

# 22 నుంచి సదరం శిబిరాలు

**ఆసిఫాబాద్, న్యూస్‌టుడే :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఈ నెల 22వ తేదీ నుంచి దివ్యాంగ సదరం శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీవో దత్తారావు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు మొదట సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైకల్య నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం మీ-సేవా కేంద్రంలో స్లాట్ బుక్ చేసుకొని సంబంధిత పత్రాలతో సదరం శిబిరాలకు హాజరు కావాలన్నారు. ఈ నెల 22న మానసిక వైకల్యం, 24న కంటిచూపు, 25న మూగ/చెవిటి, 29న ఎముకల సంబంధిత శిబిరాలు ఉంటాయని వివరించారు.

# విద్యాప్రగతిపై ఆశలు చిగురించె!

## కొత్త గురువులు, పర్యవేక్షకుల రాకతో.. బడులు బలోపేతం

**న్యూస్‌టుడే, ఆసిఫాబాద్ అర్బన్:** మొన్నటి వరకు జిల్లాలో పర్యవేక్షకుల లేమి, ఉపాధ్యాయుల కొరత.. విద్యార్థుల చదువులపై తీవ్ర ప్రభావం చూపింది. పిల్లల్లో కనీస సామర్థ్యాలు కొరవడి న్యాస్ ప్రగతిలో రాష్ట్రంలో చివరి స్థానంలో నిలిచిన విషయం విదితమే. గత మూడేళ్ల నుంచి పదో తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో చివరి రెండు, మూడు స్థానాలకే పరిమితమవుతోంది. ప్రస్తుతం డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు దాదాపు భర్తీ కాగా.. పదోన్నతుల ద్వారా ఉన్నత పాఠశాలలు బోధకుల సమస్య తీరింది. దీంతో చదువులు గాడిన పడి ఫలితాలు మెరుగవుతాయన్న ఆశాభావం జిల్లావాసుల్లో వ్యక్తమవుతోంది.

జిల్లా ఏర్పాటు నుంచి ఒకే ఒక రెగ్యులర్ ఎంఈవోతో వ్యవస్థను నెట్టుకొచ్చారు. ఇటీవల నిర్వహించిన పదోన్నతులు, బదిలీల కారణంగా అన్ని ప్రధానోపాధ్యాయుల పోస్టులతోపాటు ఉన్నత పాఠశాలల్లో పదోన్నతుల ద్వారా విషయ ఉపాధ్యాయుల పోస్టులు కూడా భర్తీ అయ్యాయి. మిగిలిన స్కూల్ పోస్టులు, ఎస్జీటీలు 270 మంది తాజా డీఎస్సీ ద్వారా నియామకమై బడుల్లో చేరారు. ప్రతి ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు ఉండటంతో సీనియర్ ప్రధానోపాధ్యాయుడిని మండల విద్యాధికారిగా అదనపు బాధ్యతలు అప్పజెబుతూ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఇటీవల ఉత్తర్వులిచ్చారు. ఫలితంగా ప్రతి మండలానికి ఎంఈవో పర్యవేక్షణకు ఆస్కారం ఏర్పడింది.


ఇటీవల కౌన్సెలింగ్‌కు హాజరైన డీఎస్సీ నూతన ఉపాధ్యాయులు

**జిల్లాలో..**
- మొత్తం ప్రభుత్వ పాఠశాలలు : 729
- విద్యార్థులు : 58,737
- మంజూరైన అన్ని కేడర్ల ఉపాధ్యాయ పోస్టులు 2,455
- అన్నికేడర్ల ఖాళీ పోస్టులు 524
- డీఎస్సీ ద్వారా భర్తీఅయినవి 270
- పదోన్నతులు, రిటైర్‌మెంట్ల ద్వారా ఏర్పడిన ఖాళీలు 254



### కలెక్టర్ సూచనలు ఆచరణీయం..

డీఎస్సీ ద్వారా బడుల్లో చేరిన యువ గురువులంతా సొంత జిల్లాకు చెందిన వారు కావడంతో.. జిల్లా ప్రగతికి వారి సేవలు ఎంతగానో తోడ్పడాలని కలెక్టర్ వారికి సూచనలు చేయడం ప్రాధాన్యం సంతరించుకొంది. రెండు రోజుల కిందట పర్యటించిన మంత్రి సీతక్క సైతం గుండి, జన్కాపూర్ పాఠశాల కార్యక్రమాల్లోనూ ఇదే విషయాన్ని గుర్తు చేశారు.

### లక్ష్యం పది ఫలితాలు.. న్యాస్ ప్రగతి

జిల్లా విద్యాధికారులు వచ్చే నెల 19న నిర్వహించే 3, 6, 9 తరగతుల విద్యార్థులను జాతీయ సాధన పరీక్షకు (న్యాస్) సిద్ధం చేయాలి. ఇప్పటికే మాక్ పరీక్షలు, వారాంత పరీక్షలు నిర్వహిస్తున్నారు. సంసిద్ధత కోసం ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు దీనిపై తక్షణం దృష్టి సారించాల్సిన అవసరముంది. మార్చిలో జరిగే పదోతరగతి ఫలితాల్లో జిల్లా స్థానం మెరుగుపర్చేందుకు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగాల్సి ఉంది. సిలబస్‌ను వచ్చే నెలలో పూర్తి చేసి ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాల్సి ఉంది. ప్రతి రోజూ పరీక్ష కార్యాచరణను అమలు చేయాల్సి ఉంది.

### జిల్లా విద్యాధికారి లేని లోటు

కింది స్థాయిలో పర్యవేక్షకులు, ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నప్పటికీ వీరందరినీ నడిపించే జిల్లా విద్యాశాఖాధికారి పోస్టు ఖాళీగా ఉండటం పర్యవేక్షణపై ప్రభావం చూపనుంది. ఇటీవల డీఈవో అశోక్ బదిలీ కాగా మంచిర్యాల డీఈవో యాదయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అక్కడి పనులతో తీరిక లేకుండా ఉండటంతో జిల్లాపై ఆశించినమేర దృష్టి సారించలేక పోతున్నారు. తాజాగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఈ విషయాన్ని మంత్రి సీతక్క దృష్టికి తెచ్చి రెగ్యులర్ డీఈవోను నియమించాలని కోరారు.

# వ్యవసాయ అక్రమ కనెక్షన్ల తొలగింపు

ఈనాడు స్పందనకు వందనం

**కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే:** కాగజ్‌నగర్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని కాగజ్‌నగర్ మండలం గంగన్నగూడలో కొంతకాలంగా అధికారులు, సిబ్బంది కనుసన్నల్లో అక్రమంగా కొనసాగుతున్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను శనివారం ట్రాన్స్‌కో అధికారులు విచారణ చేపట్టి తొలగించారు. కొన్ని వ్యవసాయ కనెక్షన్లను నిబంధనల ప్రకారం ఇవ్వకుండా క్షేత్ర స్థాయి సిబ్బంది, అధికారులు రైతులతో లోపాయికారి ఒప్పందంతో కొందరు రైతులకు అక్రమంగా ఇచ్చారు. గంగన్నగూడలో ఏర్పాటు చేసిన 100 కేవీ నియంత్రికకు అక్రమంగా 35 మందికి వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వగా ఇటీవల మరో ముగ్గురికి ఇచ్చారు. ఈ మేరకు 'నిర్లక్ష్యం.. విద్యుత్తు కష్టాలే సాక్ష్యం' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. ఇన్‌ఛార్జి ఏడీఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది విచారణ చేపట్టి గ్రామంలో నాలుగు వ్యవసాయ కనెక్షన్లు అక్రమంగా ఉన్నట్టు తేలడంతో తొలగించారు.

# నిధులు మింగిన ఘనులు



**ఈటీవీ - ఆదిలాబాద్:** ● చెక్‌డ్యాంల నిర్వహణపై పర్యవేక్షణ లేమి

ఒకప్పుడు నీటి చుట్టూ నాగరికత ప్రాణం పోసుకుంటే ఇప్పుడు రాజకీయ గ్రహణం పట్టిపీడిస్తోంది. సాగునీటి వసతి కల్పించటం, భూగర్భ జలాల పెంపునకు ప్రభుత్వం కేటాయించే రూ.కోట్ల చెక్‌డ్యాం పనుల నిర్వహణ అక్రమాలకు ఊతమిచ్చేలా సాగుతోంది. ప్రజాప్రతినిధుల జోక్యంతో అధికారుల అజమాయిషీ లేకుండా పోతోంది. నిధులు నీళ్లలా ఖర్చవుతున్నాయే తప్ప ఆశించిన ప్రయోజనం చేకూరడం లేదు.

రాష్ట్రంలో అత్యధిక వర్షపాతంతో పాటు గుట్టలు, నదులు, వాగులు, సెలయేళ్లతో సహజసిద్ధమైన భౌగోళిక స్థితిగతులతో పెనవేసుకున్న ఉమ్మడి జిల్లాలో పొలాలకు సాగునీటి లభ్యత అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది. చెక్‌డ్యాంల నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది. నాలుగేళ్లలో ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు 157 చెక్‌డ్యాంలు మంజూరు చేసింది. ఒక్కో చెక్‌డ్యాంకు రూ.2 కోట్లను పరిగణనలోకి తీసుకుంటే రూ.314 కోట్లు మంజూరు చేసింది. ఇందులో ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోనే మొదటి దశలో రూ.120 కోట్లు, రెండో దశలో రూ.45 కోట్లు మంజూరు చేసింది. ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలో చాలాచోట్ల పనులు పూర్తి చేయకుండానే చేసినట్లుగా సర్దుబాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. కరోనా కారణంగా మొదటి దశ పనుల నిర్వహణ కొంతమంది ప్రజాప్రతినిధులు, అధికారుల ఇష్టాయిష్టాలతోనే జరిగింది. రెండో దశలో మంజూరైన వాటిలో ఇప్పటికీ చాలా చోట్ల ప్రారంభమే కాలేదు.

**రెండు దశల్లో మంజూరైన చెక్‌డ్యాంలు**

| జిల్లా | మొదటిదశ | రెండోదశ |
| --- | --- | --- |
| ఆదిలాబాద్ | 54 | 16 |
| ఆసిఫాబాద్ | 09 | 11 |
| మంచిర్యాల | 16 | 08 |
| నిర్మల్ | 23 | 21 |

### ప్రమాదానికి హేతువు

ఇది భీంపూర్ మండలంలోని ధనోర వాగుపై అంతర్రాష్ట్ర వంతెనను ఆనుకొని రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్మించిన చెక్‌డ్యాం. రూ.1.70 కోట్లు ఖర్చయినా ఫలితం లేదు. పైగా వర్షాకాలంలో వాగు ఉద్ధృతితో వెనుక జలాలు వంతెనపైకి వచ్చే నీటి ప్రవాహంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.




☛ ఆదిలాబాద్ మండలం యాపల్‌గూడలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్మించిన చెక్‌డ్యాం నిరుపయోగంగా మారింది. వేసవిలో నీరే ఉండటం లేదు.

### ఖాళీలే..

మంచిర్యాల జిల్లాలో కీలకమైన ఎస్‌ఈ పోస్టు కనీసం ఇన్‌ఛార్జి బాధ్యతల్లేకుండా ఖాళీగానే ఉంది. నెల, రెండు నెలల్లో పదవీ విరమణ చేసే డీఈఈలను పదోన్నతిపై ఇన్‌ఛార్జి ఎస్‌ఈగా నియమించే పద్ధతి సాగుతోంది. అయిదు నెలల కిందట జి.శ్రీనివాస్‌రెడ్డి పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి ఎస్‌ఈగా వచ్చిన మురళీధర్ జూన్ 30న, తర్వాత ఇన్‌ఛార్జిగా నియమితులైన శివకుమార్ జులై 30న, మళ్లీ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టిన కొంతం శ్రీనివాస్ సెప్టెంబరు 30న పదవీ విరమణ చేశారు. ఇప్పుడు కనీసం ఇన్‌ఛార్జి కూడా లేరంటే పనుల పర్యవేక్షణ అర్థం చేసుకోవాల్సిందే..

● ఇంద్రవెల్లి, బోథ్, సిరికొండ, జైనూర్, బెజ్జూర్ మండలాల పనులపై ఇంజినీర్లు ఇచ్చిందే పనులు ఉన్నట్లుగా నడుస్తోంది.

● ఆదిలాబాద్ ఎస్‌ఈ రామును 'ఈనాడు' సంప్రదిస్తే వివరాలేమీ నాకు తెలియదు. అంతా ఈఈ, డీఈల దగ్గరే ఉంటుందని వివరించటం విశేషం.

# ఐటీడీఏ సమావేశాల ఊసేది?

● అయిదేళ్లవుతున్నా పట్టించుకోని వైనం

**న్యూస్‌టుడే, ఇంద్రవెల్లి:** సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) పాలకవర్గం ప్రతి ఆరు నెలలకోసారి సమావేశమై ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనుల సమస్యలు.. మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించాలి. ఉట్నూరు ఐటీడీఏలో ఈ సమావేశాల నిర్వహణ ఊసెత్తడమే లేదు. చివరిసారిగా 2019 అక్టోబరు 30న నిర్వహించారు. దాదాపు అయిదేళ్లవుతున్నా సమావేశం గురించి పట్టించుకోవడమే మానేశారు.

ప్రతి ఆరు నెలలకోసారి ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులతో పాటు జిల్లాస్థాయి అధికారుల సమక్షంలో పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించాలి. సమావేశానికి జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ, సబ్ కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, జిల్లా మంత్రితో పాటు ఎమ్మెల్సీలు హాజరవుతారు. భారాస ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో సమావేశాన్ని నిర్వహించలేదు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 10 నెలలైనా సమావేశంపై దృష్టి సారించలేదు.


ఉట్నూరు ఐటీడీఏ కార్యాలయం

### అవకాశమే రాలేదు.. : - గోడం నగేష్, ఎంపీ, ఆదిలాబాద్



అయిదేళ్లుగా సమావేశాలు లేకపోవడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ మండలాల నుంచి ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులకు అయిదేళ్ల పదవి కాలంలో గిరిజనుల సమస్యలను ప్రభుత్వంతో పాటు అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశమే రాలేదు. జిల్లా పరిషత్ సమావేశాలలో సైతం గిరిజన ప్రజాప్రతినిధులకు సమస్యలను ప్రస్తావించే అవకాశం కల్పించలేదు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఐటీడీఏ పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించి గిరిజనుల సమస్యల పరిష్కారానికి మార్గం చూపాలి.

### గోడు వినిపించుకోవడం లేదు

- పుర్కా బాపురావు, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల అభివృద్ధికి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ప్రకటిస్తున్నారే తప్ప గిరిజనులకు మౌలిక వసతులు కల్పించడం లేదు. మారుమూల గిరిజన గ్రామాలకు నేటికీ కనీసం రవాణా సౌకర్యం లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఐటీడీఏ పాలక వర్గ సమావేశం నిర్వహిస్తే గిరిజనుల సమస్యలు తెలుస్తాయి. భారాస ప్రభుత్వం పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలైనా దృష్టి సారించడం లేదు.

# 24న కెరమెరిలో భీం ఉత్సవాలు

**కెరమెరి, న్యూస్‌టుడే :** మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో ఈనెల 24న భీం వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నామని రాజ్‌గోండ్ సేవాసమితి మండల అధ్యక్షుడు మడావి రఘునాథ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ భీం ఉత్సవాలకు అధిక సంఖ్యలో ఆదివాసీ నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భీం ఉత్సవ కమిటీ ఛైర్మన్ పెందుర్ రాజేశ్వర్, నాయకులు కోవ విజయ్, జగన్నాథ్‌రావ్, కనక ప్రభాకర్ భీంరావ్ పాల్గొన్నారు.

## తాటిచెట్టుపై పిడుగుపాటు



పిడుగుపాటుకు చెలరేగుతున్న మంటలు

**హాజీపూర్, న్యూస్‌టుడే :** మండలంలో శనివారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములు, పిడుగులతో కురిసిన అకాల వర్షానికి ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలోని పెద్దంపేటలో బొప్పు ఎల్లయ్య ఇంటి సమీపంలో ఓ తాటిచెట్టుపై పిడుగు పడి మంటలు చెలరేగడంతో గ్రామస్థులు ఆందోళనకు గురయ్యారు. పిడుగు పడే సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. కాగా మండలంలోని పెద్దంపేట, దొనబండ, టీకనపల్లి, హాజీపూర్ తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది.

## చెరువా.. తామర వనమా



తోటలో పూల సాగు చేసినట్లు కనిపిస్తున్న ఈ దృశ్యం కడెం మండలం కన్నాపూర్ చెరువులోనిది. ఇక్కడి చెరువు నిండా తామరపూలు పూస్తున్నాయి. ఇటీవల దేవీ నవరాత్రులు, బతుకమ్మ పండగకు చాలామంది ఇక్కడి తామరపూలను కోసుకెళ్లారు. చెరువులో ఇలా రోజూ పూలు పూస్తుండటంతో తామర పూల తోటలా కనిపిస్తోంది. నిర్మల్-మంచిర్యాల రహదారిని ఆనుకుని ఉన్న ఈ చెరువులోని తామరలు కనువిందు చేస్తున్నాయి. - కడెం, న్యూస్‌టుడే

## కల్లు గీతకు తి(తె)ప్పలు



తెప్పపై వెళ్లి కల్లుగీయడానికి చెట్టు ఎక్కుతున్న గీతకార్మికుడు

ధర్మకోల్ తెప్పలతో సాధారణంగా గంగపుత్రులు చేపల వేట కొనసాగిస్తారు. కానీ నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం బన్సపల్లి శివారులోని గోదావరి నది శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వెనుక జలాలు సమీపంలో కొన్ని తాటి, ఈత చెట్లు జలమయం కావడంతో కల్లుగీత కార్మికులు తెప్పల సాయంతో కల్లు సేకరించి జీవనోపాధి పొందాల్సి వస్తోంది. ఏటా గోదావరి జలాలు పూర్తిస్థాయిలో నిండటంతో నీరు తగ్గేవరకు సముందర్‌పల్లి, గుండంపల్లి, టెంబుర్ని గ్రామాల్లోని పలువురు గీతకార్మికులు చెట్ల వద్దకు వెళ్లడానికి తప్పనిసరిగా తెప్పలు వాడాల్సి వస్తోంది. - న్యూస్‌టుడే, దిలావర్‌పూర్



బన్సపల్లిలో తెప్పపై కల్లుకుండతో వస్తూ...

# రైతు బిడ్డలు.. వ్యవసాయాధికారులు

## ● కర్షకుల ఇంట కొలువుల పంట

మామడ, న్యూస్‌టుడే:

**వ్యవసాయమే ఆధారంగా జీవించే రైతుల పిల్లలు ప్రయోజకులై కొలువులు సాధిస్తే అంతకు మించిన ఆనందం ఇంకోటి ఉండదు. అనేక ప్రతికూల పరిస్థితులను తట్టుకొని ఏడాదికి ఒకటీ రెండు పంటలు పండించే కుటుంబాల్లో నెలకో దిగుబడి వస్తే ఎంతో ఆనందంగా ఉంటుంది. ఇటీవలే విధుల్లో చేరిన ఈ యువ వ్యవసాయాధికారులది పక్కా కర్షక కుటుంబం. బాల్యం నుంచే తల్లిదండ్రులతో పాటు సాగు పనులు చేసిన అనుభవం వారిది. పాతికేళ్ల వయసులోనే రెండు మూడు ఉద్యోగాలు సాధించి ఇప్పుడు ఏకంగా ఓ మండలానికి అధికారిగా గెజిటెడ్ హోదా పొందిన ఇద్దరు యువకుల నేపథ్యమిదీ...**



వ్యవసాయ పనుల్లో నవీన్ తల్లిదండ్రులు బన్సి-కళ

### తండా కుర్రోడి తడాఖా..

మామడ మండలం లింగాపూర్ తండాకు చెందిన నునావత్ బన్సి-కళ దంపతుల కుమారుడు నవీన్. ప్రస్తుతం ఈయన పెంబి మండల వ్యవసాయాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో ఏజీ బీఎస్సీ మొదటి సంవత్సరంలోనే అనారోగ్యం వల్ల చదువుకు ఆటంకం కలిగింది. డిగ్రీ పూర్తయ్యేందుకు ఓ ఏడాది ఆలస్యమైంది. ఈ క్రమం ఆయనను కొంత కుంగుబాటుకు గురిచేసింది. ఆత్మవిశ్వాసం కూడగట్టుకొని పట్టు సడలన్వికుండా మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. ఆ వెంటనే బ్యాంకు ఉద్యోగాల కోసం శిక్షణకు వెళ్లారు. అనేక పోటీ పరీక్షలు రాశారు. తొలి ఉద్యోగం యూనియన్ బ్యాంకులో గ్రామీణాభివృద్ధి అధికారిగా ఆంధ్రప్రదేశ్‌లో వచ్చింది. ఆ తర్వాత ఎఫ్‌సీఐలో మంచి హోదా గల అధికారిగా ఎంపికైనా బ్యాంకు కొలువులోనే కొనసాగారు.

### నవీన్ ఏమంటున్నారంటే..



చిన్నప్పటి నుంచి అమ్మానాన్నల కష్టం చూశాను. రెక్కలు ముక్కలు చేసుకొని చదివించారు. ఎలాగైనా వారి కష్టాలను గట్టెక్కించాలన్న కసితో ముందుకెళ్లాను. పోటీ పరీక్షల్లో రాణించాలంటే సాదాసీదా ప్రయత్నాలతో పని కాదు. పట్టుదల, ప్రణాళిక చాలా ముఖ్యం. సమయం ఎంతో కీలకం. ఎక్కడా వృథా చేయొద్దు. ఏ పరీక్ష రాసినా పాత ప్రశ్నాపత్రాల సాధన బాగా చేయాలి. పెద్ద లక్ష్యం పెట్టుకుంటే ఏదో ఒకటి తప్పకుండా సాధించొచ్చు.




తల్లిదండ్రుల నర్సవ్వ-మాణిక్‌రావుతో పొలం పనుల్లో గిరిరాజ్

### పట్టుదలే పెట్టుబడిగా..

దిలావర్‌పూర్‌కు చెందిన నర్సవ్వ-మాణిక్‌రావు దంపతుల కుమారుడు గిరిరాజ్ తాజాగా లోకేశ్వరం వ్యవసాయాధికారిగా నియామకమయ్యారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో ఏజీ బీఎస్సీ పూర్తి చేశారు. కేరళ వ్యవసాయ శాఖలో పీజీ చేసేందుకు అవకాశం వచ్చినా ఉద్యోగం సాధించాలన్న తపనతో అనేక పోటీ పరీక్షలు రాశారు. ఇఫ్కోలో మేనేజరుగా ఎంపికై గద్వాలలో పనిచేశారు. ఇంకా మంచి స్థానానికి చేరుకోవాలన్న లక్ష్యంతో గ్రూప్స్, ఎస్సై ఎంపిక పరీక్షలకు సన్నద్ధమయ్యారు. ఈ క్రమంలో ఏవో ఉద్యోగం సాధించి వ్యవసాయాధికారి అయ్యారు.

### విజయానికి దగ్గరి దారులు ఉండవు: గిరిరాజ్



తల్లిదండ్రులు ఉద్యోగులైతే ఆర్థికంగా అంత ఇబ్బందులుండవు. పరిస్థితులు అనుకూలిస్తాయి. రైతు కుటుంబాలకు కాస్త భారమే అవుతుంది. ఈ పరిస్థితులను దగ్గరగా చూసి ఎలాగైనా ప్రయోజకుడినై అమ్మానాన్నలను సంతోష పెట్టాలన్న తపన నిత్యం మదిలో మెదిలేది. ఏదైనా సాధించే వరకు ప్రయత్నం ఆపొద్దన్న లక్ష్యం పెట్టుకున్నాను. ఏ విజయం సాధించాలన్న దానికి దగ్గరి దారులంటూ ఏవీ ఉండవు. నిరంతర ప్రయత్నంతోనే ఫలితం వస్తుంది. చాలా మంది ఉద్యోగ ప్రకటన విడుదలయ్యాకే చదవడం మొదలు పెడుతారు. ఎంతో మంది ప్రతిభావంతులున్న ఈ పోటీ ప్రపంచంలో పైపై ప్రయత్నాలతో విజయం కష్టమే.. ఎస్సై, గ్రూప్స్‌కు ముందు నుంచే సన్నద్ధం కావడంతో ఆ పరిజ్ఞానం ఏవో పరీక్షలో నాకు ఉపయోగపడింది.

# ఆలోచనలు పరుగెత్తేలా.. నడిచే ప్రయోగశాల

## ● ప్రత్యేకంగా కుమురంభీం జిల్లా విద్యార్థులకు కేటాయింపు

న్యూస్‌టుడే, ఆసిఫాబాద్ అర్బన్

**శాస్త్ర సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్న ప్రస్తుత రోజుల్లో పాఠశాల నుంచే విద్యార్థుల్లో ఆ ఒరవడి సృష్టించాల్సిన అవసరముంది. వసతుల లేమితో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగశాలలు ఆశాజనకంగా లేకున్నా.. అత్యాధునిక వసతులు, పరికరాలతో కూడిన సంచార సైన్స్ ల్యాబ్ వాహనాన్ని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీహెచ్‌ఈఎల్) సంస్థ కుమురంభీం జిల్లాకు ప్రత్యేకంగా సమకూర్చింది. గదుల్లో నేర్చుకున్న భౌతిక, రసాయన సిద్ధాంతాలు, వివిధ సూత్రాలను ప్రయోగాలతో అవగాహన కలిగించే అవకాశం ఉండటంతో.. విద్యార్థులకు ఇది ఎంతో ఉపయుక్తంగా మారనుంది. మంత్రి సీతక్క ఈ నెల 16న ఆసిఫాబాద్‌లో దీన్ని ప్రారంభించారు.**

రూ.80 లక్షలతో ఈ సంచార వాహనాన్ని అత్యాధునికంగా తీర్చిదిద్దారు. సెంట్రల్ ఏసీ, ప్రొజెక్టర్, స్క్రీన్, జనరేటర్, శౌచాలయంతో పాటు పాఠశాలల్లోని ల్యాబ్‌లకు భిన్నంగా ప్రయోగ పరికరాల ప్రదర్శన, భద్రపరిచే ఏర్పాట్లు ఉన్నాయి. తెలిసిన విషయాలనే వివిధ పరికరాలతో ఆసక్తికరంగా చూపిస్తూ విద్యార్థుల్లో తెలుసుకోవాలన్న ఆలోచన కలిగేలా పొందుపర్చారు. అయితే ఈ వాహనానికి డ్రైవర్, హెల్పర్, ఇంధనం తదితర ఖర్చుల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించాల్సి ఉంది.



సంచార సైన్సు ప్రయోగశాల బస్సు



సంచార సైన్సు ప్రయోగశాలలో భౌతిక, జీవ, గణితశాస్త్రాల ప్రయోగాలు, నమూనాలతో సైన్సు విషయ నిపుణులు

### మ్యాజిక్ మయం..

వాహనంలో మ్యాజిక్ తలపించే ప్రయోగాల ప్రదర్శన ఆకట్టుకుంటుంది. మ్యాజిక్ వాటర్ ట్యాప్, న్యూటన్ ఊయల, జడత్వ నియమం, చర్య ప్రతిచర్య, పంజరంలో చిలుక, గుర్రపు చట్రం, పీడన చట్రం, గాలిలో అయస్కాంతం, తదితర భౌతిక, రసాయన, జీవ, గణిత ప్రయోగాలు అద్భుత భావనలు దృశ్య భ్రాంతిని కలిగిస్తాయి.

### మ్యాజిక్ వాటర్ ట్యాప్

ఎలాంటి ఆధారం లేకుండానే కుళాయి ఏర్పాటు, అందులోంచి నీరు కిందకు పడుతున్నట్లు కనిపించే ఈ మ్యాజిక్ వాటర్ ట్యాప్ ఆసక్తి కలిగిస్తుంది.



### న్యూటన్ ఊయల

వేలాడదీసిన లోలక గుండ్లలో.. ఒక దాన్ని లాగి వదిలితే అవతలి వైపున్న ఒక గుండు అంతే వేగంతో కదులుతుంది. మిగతావి కదలవు. అలానే రెండు, మూడు లాగి వదిలినా.. సమాన సంఖ్యలో అవతలి గుండ్లు కదులుతాయి. న్యూటన్ నియమాల ఆధారంగా ఇది పనిచేస్తుంది.





పీడన చట్రం

### చిలుక, గుర్రం..

ఒక చట్రం పైభాగాన ఓ వైపు చిలుక చిత్రం, మరోవైపు పంజరం చిత్రాన్ని ఉంచి చట్రాన్ని గిరగిరా తిప్పితే.. పంజరంలో చిలక ఉన్న భ్రాంతి కలుగుతుంది. అలాగే చట్రంలోని గుర్రపు బొమ్మ సైతం తిప్పినపుడు ముందుకు పరుగెడుతున్నట్లు కనిపిస్తుంది.



### ముందుగా ఉపాధ్యాయులకు శిక్షణ



**- కటుకం మధుకర్, జిల్లా సైన్సు అధికారి**

సంచార ప్రయోగశాల జిల్లాకు కేటాయించడం అభినందనీయం. అత్యాధునిక భావనలు, సౌకర్యాలతో ఉన్న ఈ ప్రయోగశాలను జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల వద్దకు తీసుకుపోయి వీలైనంత త్వరగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తాం. ముందుగా సైన్సు ఉపాధ్యాయులకు దీనిపై శిక్షణనిస్తాం. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం.

## వేడి పుట్టించవు.. మంటలు రావు



వీధి దీపాల్లా కనిపిస్తున్న ఈ లైట్లు సాధారణమైనవి కావు. సాధారణ వీధి దీపాలు వేడిని పుట్టిస్తాయి. ఆదిలాబాద్ జైలు బంకు సమీపంలో త్వరలో ప్రారంభించనున్న సీఎన్‌జీ గ్యాస్ స్టేషన్ వద్ద జిల్లాలోనే మొదటి సారి ఈ అన్‌ఫ్లేమబుల్ లైట్లను ఏర్పాటు చేశారు. ఇవి సాధారణ దీపాలకు భిన్నంగా ఉంటాయి. వీటి వల్ల అక్కడ ఉష్ణోగ్రతలు పెరగదు. ఒక్కోదానికి రూ.5,500 ఉంటుంది. సీఎన్‌జీ గ్యాస్ పంపుల వద్ద వీటిని ఏర్పాటు చేస్తారు. ఒక వేళ పొరపాటున గ్యాస్ లీక్ అయినా మంటలంటుకోవు.

**- ఈనాడు, ఆదిలాబాద్ - న్యూస్‌టుడే, ఆదిలాబాద్ నేర విభాగం**

## జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు లక్ష్మణ్‌సాయి



**మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే :** పాఠశాల క్రీడా సమాఖ్య జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారుడు ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన జిల్లా, రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో మెరుగైన ఆటతీరును కనబరుస్తూ నిలకడగా రాణిస్తున్న వేములపల్లి లక్ష్మణ్‌సాయి తెలంగాణ జట్టులో చోటు దక్కించుకున్నాడు. త్వరలో బిహార్‌లో జరగనున్న ఆయా పోటీల్లో పాల్గొననున్నాడు. లక్ష్మణ్ ప్రస్తుతం మంచిర్యాల కేంద్రీయ విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతుండగా స్థానిక గురు క్రికెట్ అకాడమీలో శిక్షకుడు దుర్గాప్రసాద్ సమక్షంలో శిక్షణ తీసుకుంటున్నాడు.



# మొలకలు.. కాస్త భిన్నంగా



**న్యూస్‌టుడే, మంచిర్యాల సిటీ:** ఆరోగ్యకరమైన అలవాట్లను జిల్లా కేంద్రానికి పలువురు రోజుకో రకంగా పరిచయం చేస్తున్నారు. ఇటీవల కాలంలో గ్రీన్, లెమన్, బెల్లం టీ, చిరుధాన్యాల జావ ఇలా అనేక రకాల ఆరోగ్యాన్ని పెంచే కేంద్రాలను అందుబాటులో తీసుకొచ్చారు. ప్రజలు సైతం వీటిని తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం మంచిర్యాల పట్టణానికి మరోరకం ఆరోగ్యకరమైన ఆహారాన్ని తాగేది కాకుండా తినే పదార్థం వినియోగంలోకి తీసుకొచ్చారు. చెన్నూరుకు చెందిన రాజు అనే యువకుడు కాస్త వినూత్నంగా పరిచయం చేస్తున్నాడు. హెల్తీ, స్పైసీ మొలకలంటూ కాస్త భిన్నంగా అప్పటికప్పుడు సిద్ధం చేసి అందిస్తున్నారు. హంగు, ఆర్భాటాలు లేకుండా మిర్చి బండి మాదిరిగా ఏర్పాటు చేసి జిల్లావాసుల ఆరోగ్యాన్ని పంచు(పెంచు)తున్నారు.



కాస్త రుచికరంగా ఇలా సిద్ధం చేస్తూ..

మొలకలు (ఉలవలు, మొక్కజొన్న, పెసర్లు, ఎర్ర పెసర్లు, బబ్బర్లు, శనగలు, పల్లీలు) ఆరోగ్యానికి మంచిదంటారు. కొంతమంది వీటితోనే దినచర్య ప్రారంభిస్తారు. ఎప్పటినుంచో అందుబాటులో ఉన్నా ప్రస్తుతం ఆరోగ్యకరమైన అలవాట్లు పెరగడంతో వీటికీ మరింత ప్రాధాన్యం పెరిగింది. కొందరు కాస్త ఓపికతో వారి వారి నివాసాల్లోనే విత్తనాలను రాత్రి నానబెట్టి మొలకెత్తిన అనంతరం పచ్చివే ఉదయం తింటుంటారు. వీటిని తినడం ఆరోగ్యానికి మంచిదే అని తెలిసినా పచ్చివి తినాలంటే కొంతమంది ఇబ్బంది పడుతుంటారు. వారి కోసమే ఈ బండిని అందుబాటులోకి తీసుకొచ్చినట్లుగా ఉంది. వేసివేయనట్లుగా నూనె, కాస్త ఉప్పు, కారంతో ఫ్రై చేస్తున్నారు. చివరగా కొంత నిమ్మరసం కలిసి ఆహా అనేలా రుచికరంగా సిద్ధంచేసి విక్రయిస్తున్నారు.

## కవ్వాల్‌లో కలియ తిరిగి.. అందాలు తిలకించి...!



అటవీశాఖ అధికారులతో డిప్యూటీ కన్జర్వేటర్ మాధవరావు

**జన్నారం, న్యూస్‌టుడే :** అటవీశాఖ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ కన్జర్వేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సిరిపురం మాధవరావు శనివారం కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలో పర్యటించారు. ఇక్కడి అందాలను తిలకించి తన కెమెరాలో బంధించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన శాఖాపరమైన సమావేశానికి హాజరైన ఆయన రాత్రి జన్నారంలోనే బస చేశారు. శనివారం ఉదయం అడవిలోకి వెళ్లి బైసన్‌కుంట, గోండుగూడ బేస్ క్యాంపు తదితర ప్రాంతాలను ఇక్కడి అటవీశాఖ అధికారులతో కలిసి పర్యటించారు. అనంతరం మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశానికి హాజరయ్యారు. డిప్యూటీ రేంజి అధికారి తిరుపతి, సెక్షన్ అధికారులు హనుమంతరావు, కిరణ్మయిజ్యోతి, బీట్ అధికారులు రుబీనా, లాలుబాయి తదితరులు పాల్గొన్నారు.

## అపరిచితులకు వివరాలు చెప్పొద్దు

**కుంటాల:** సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సైలు దేవ్‌రావు, రాందాస్ సూచించారు. మండలంలోని వెంకూర్‌లో శనివారం అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు, ఆధార్ వివరాలు, ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పమంటే తిరస్కరించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని పేర్కొన్నారు. సూచనలు చేస్తూ సందేహాలను నివృత్తి చేశారు.

## రాష్ట్ర స్థాయి కళోత్సవ్‌కు విద్యార్థిని ఎంపిక



నృత్యం చేస్తున్న సహస్రగౌడ్

**జన్నారం, న్యూస్‌టుడే :** మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని స్లేట్ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న గాజుల సహస్రగౌడ్ రాష్ట్ర స్థాయి కళోత్సవ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 16న నిర్వహించిన కళోత్సవ్-2024 గాను జిల్లా స్థాయి కూచిపూడి నృత్యాలలో సహస్ర ఉత్తమ ప్రతిభ కనబరిచారు. నవంబర్ 1న జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఆమె పాల్గొంటారు. ఈ మేరకు పాఠశాల నిర్వాహకులు విద్యార్థిని అభినందించారు.

## సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌లో మెరిసిన కార్తిక్



రాథోడ్ కార్తిక్

**ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే :** ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సౌత్‌జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా విద్యార్థి మెరిశాడు. ట్రయాథ్లాన్(60మీ., 600మీ.ల పరుగు, లాంగ్‌జంప్) క్రీడాంశంలో బజార్‌హత్నూర్ మండలం జాతర్ల గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలకు చెందిన రాథోడ్ కార్తిక్ మొదటి స్థానంలో నిలిచి పసిడి పతకం సాధించాడు. ఆయనకు జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డి భోజారెడ్డి, పి.రాజేశ్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, పెటా ప్రధాన కార్యదర్శి ఎన్.స్వామి, కోచ్ సునంద్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

**కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే:**

? భట్టుపల్లి పంచాయతీ జీడిచేను కాలనీలో ఆరు నెలలుగా మురుగు కాలువల్లో పూడిక తీయడం లేదు. దుర్గంధం వస్తోంది. **-కె.హరీశ్‌కుమార్, స్థానికుడు**

✔ రెండ్రోజుల్లో మురుగు కాలువల్లో పూడిక తీయించేలా చర్యలు చేపడతాం. **- రమేష్, ఎంపీడీఓ, కాగజ్‌నగర్**


**కాగజ్‌నగర్, న్యూస్‌టుడే:**

? పట్టణంలోని పెట్రోల్‌పంపు ఏరియాలో ఉన్న ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి రోడ్లపైకి వస్తున్నాయి. పాములు సంచరిస్తు సమీపంలోని ఇళ్లలోకి వస్తున్నాయి. **- హనుమంతు, కాగజ్‌నగర్**

✔ ఖాళీ స్థలాల యజమానులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. చర్యలు చేపడతాం. **- అంజయ్య, కమిషనర్, కాగజ్‌నగర్**

## అదుపుతప్పిన ద్విచక్రవాహనం.. సింగరేణి కార్మికుడు మృతి

**రెబ్బెన, న్యూస్‌టుడే:** ఇందిరానగర్ సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో.. ఓ సింగరేణి కార్మికుడు మృతి చెందారు. ఎస్సై డి.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. గోలేటికి చెందిన దుర్గం బాపు(57) గోలేటి సింగరేణి సీహెచ్‌పీలో జనరల్ మజ్దూర్‌గా పని చేస్తున్నారు. శనివారం గోలేటి నుంచి పని నిమిత్తం కాగజ్‌నగర్ క్రాసు రోడ్డు వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఇందిరానగర్ సమీపంలోని వంతెన వద్ద అజాగ్రత్తగా, అతివేగంగా నడపడంతో కిందపడ్డాడు. తలకు బలమైన దెబ్బ తగలడంతో వెంటనే 108 వాహనంలో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తీసుకెళ్తుండగా.. మార్గమధ్యలో మృతి చెందారు. మృతుడి బంధువు కోరల్ల రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా దుర్గం బాపు ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగిగా ఎంపికై సింగరేణి ఉన్నతాధికారులతో సన్మానం పొందారు. బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్, ఏరియా ఇంజినీర్ భీమ్‌రావు జాడే మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుడికి భార్య వరలక్ష్మి, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.


దుర్గం బాపు

## ఒకరిపై కేసు నమోదు

**ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే :** ఆసిఫాబాద్ పట్టణంలోని మజీద్‌వాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విధుల్లో ఉన్న ఎస్జీటీ ఉపాధ్యాయుడు జాదవ్ గోవింద్‌రావుపై దాడి చేసి గాయపర్చిన వ్యక్తిపై ఆసిఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సతీష్‌కుమార్, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం 3.45 గంటలకు ఉపాధ్యాయుడు జాదవ్ గోవింద్‌రావు విధులు నిర్వహిస్తుండగా అందులో చదివే ఓ విద్యార్థిని తండ్రి ఇగురపు విలాస్ మద్యం తాగి వచ్చి దుర్భాషలాడి భౌతికంగా దాడిచేసి గాయపరిచాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విలాస్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

## అనుమతి లేకుండా లాటరీ నిర్వహిస్తే చర్యలు

**ఆసిఫాబాద్, న్యూస్‌టుడే :** అనుమతి లేకుండా లాటరీ నిర్వహిస్తే చర్యలు తప్పవని సీఐ సతీష్ హెచ్చరించారు. శనివారం ఉదయం జన్కాపూర్ ఆదిలాబాద్ ఎక్స్‌రోడ్డు వద్ద నలుగురు వ్యక్తులు బులాయి పేరుతో లాటరీ టికెట్లు అమ్ముతూ పోలీసులకు పట్టుబడినట్లు తెలిపారు. లాటరీలో వాహనం, టీవీ ఉన్నాయని ఫ్లెక్సీ ద్వారా ప్రచారం చేస్తూ టికెట్లు విక్రయిస్తున్నారన్నారు. ఇది ప్రజలను మోసం చేసినట్లేనని, మండలంలోని జెండగూడకు చెందిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఎవరైనా లాటరీల ద్వారా బహుమతులు ఇస్తామని ప్రచారం చేస్తూ టికెట్లు అమ్మితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## 108 వాహనంలో ప్రసవం..

**కౌటాల, న్యూస్‌టుడే :** మండలంలోని సైదాపూర్ గ్రామానికి చెందిన గర్భిణి సౌజన్యకు శుక్రవారం అర్ధరాత్రి పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్సును సంప్రదించారు. 108 వాహనం సైదాపూర్ గ్రామానికి చేరుకొని సౌజన్యను కౌటాల పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ అజయ్‌కుమార్, పైలట్ శ్రావణ్‌లు.. సాధారణ ప్రసవం చేశారు. ఆమెకు మొదటి కాన్పులో ఆడబిడ్డ జన్మించిందని వారు పేర్కొన్నారు.

## వృద్ధుడిని కుటుంబీకుల చెంతకు చేర్చి

**కాగజ్‌నగర్, న్యూస్‌టుడే :** పట్టణంలోని సంఘం బస్తీకి చెందిన తగరం దుర్గయ్య(78)ను.. 10వ వార్డుకు చెందిన కాంగ్రెస్ నాయకులు వనమాల రాము, బ్లూకోల్ట్ సిబ్బంది వెంకటేష్‌లు శనివారం కుటుంబీకుల చెంతకు చేర్చారు. వివరాల ప్రకారం.. దుర్గయ్య రెండు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. శ్రీరాంనగర్ కాలనీ సమీపంలో తిరుగుతుండగా గమనించిన రాము పోలీసులకు సమాచారం ఇచ్చి వివరాలు సేకరించారు. సంఘం బస్తీకి చెందినట్లుగా గుర్తించి సదరు వృద్ధుడి ఆయన కుమారుడు తగరం చందుకు అప్పగించారు.

## ప్రొటోకాల్ పాటించలేదని కాంగ్రెస్ నాయకుల ఆరోపణ

**సిర్పూర్(టి), దహెగాం, న్యూస్‌టుడే :** ఇటీవల దహెగాంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ప్రొటోకాల్ పాటించలేదని కాంగ్రెస్ పార్టీ సిర్పూర్(టి) మండల అధ్యక్షుడు తిరుపతి, దహెగాం మండల నాయకులు ఆరోపించారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ ఛైర్మన్ దేవయ్య, వైస్ ఛైర్మన్‌లను ఆహ్వానించలేదని నిబంధనలు ఉల్లంఘించారన్నారు. సీఈఓ బక్కయ్య చేసిన పనితీరుపై ఆయనపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామ్‌నాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సమీర్, శంకర్, నాయకులు గందె వెంకటేష్, చెమ్మకారి తోగేష్, రాంటెంకి సురేష్, ఆయిల్ల శంకర్ తదితరులున్నారు.


సిర్పూర్-టి లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

## కాలిపోయిన నియంత్రిక

**కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే:** మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన చిరు జల్లులు పడ్డాయి. మండలంలోని గువ్వలగూడలో పెద్ద శబ్దంతో ఉరుము పడటంతో గ్రామంలోని రెండు విద్యుత్తు నియంత్రికల్లో ఒకటి దెబ్బతింది. ఆరు వీధిలైట్లు, ఒకరి ఇంట్లోని మూడు విద్యుత్తు దీపాలు కాలిపోయాయి. సిబ్బంది సకాలంలో చేరుకొని మరో నియంత్రికకు తాత్కాలికంగా కనెక్షన్ ఇవ్వడంతో గ్రామంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగలేదు.

## ఆదివాసీ ఉత్సవాల విజయవంతానికి పిలుపు

**రెబ్బెన, న్యూస్‌టుడే:** ఆదివాసీల ఆరాధ్య దైవం కుమురంభీం పుట్టిన స్థలం రౌత సంకెపల్లిలో ఈ నెల 22న కుమురంభీం, ఆయన అనుచరుడు ఎడ్ల కొండు వర్ధంతి సందర్భంగా నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచమల్లు కోరారు. శనివారం రెబ్బెనలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహ ఆవరణలో వేడుకలకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించి మాట్లాడారు. వేడుకలకు గిరిజనులు, గిరిజనేతరులు, ఆదివాసీ సంఘం నాయకులు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఇట్యాల కిష్టయ్య, బక్కయ్య, కొలవార్ జిల్లా సేవా సంఘం నాయకులు కొడిపె వెంకటేష్, నాయిని సంతోష్, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బుర్స పోచమల్లు, గౌరవాధ్యక్షుడు టేకం భీమయ్య, నాయకులు శ్యామ్‌రావు, విలాస్, చిన్నయ్య, మహేందర్, శంకర్, భీమ్‌రావు ఆనందరావు, రవి పాల్గొన్నారు.

**బెజ్జూరు:** పోరాట యోధుడు కుమురంభీంకు ముఖ్య సహచరుడైన ఎడ్ల కొండు వర్ధంతి సందర్భంగా ఈ నెల 21న నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ నాయకులు పిలుపునిచ్చారు. దానికి సంబంధించిన గోడప్రతులను శనివారం విడుదల చేశారు. 22న కుమురంభీం జయంతి ఉత్సవాలను గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని కోరారు. సకారాం, వెంకటేష్, తుకారాం, రమేష్, వెంకటేష్, పద్మ, శంకర్, తదితరులున్నారు.

# పోటీ పడి.. విజేతలుగా నిలిచి


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపల్ క్రాంతి

**ఆసిఫాబాద్, న్యూస్‌టుడే :** విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు 'ఈనాడు' ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శ్రీవాసవి హైస్కూల్‌లో శనివారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగంలో లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై 8, 9, 10 తరగతి విద్యార్థులు వ్యాసరచన పరీక్షలు రాశారు. మొత్తం 101 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొని ప్రతిభ ప్రదర్శించారు. వారిలో ఉత్తములుగా నిలిచిన ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులు, ప్రశంసా పత్రాలను పాఠశాల ప్రిన్సిపల్ గందె క్రాంతి చేతుల మీదుగా అందించారు. మొదటి స్థానంలో కె.సుగుణాకర్ (10వ తరగతి), ద్వితీయ స్థానంలో ఎస్.అనన్య (9వ తరగతి), తృతీయ స్థానంలో జి.శివమణి (10వ తరగతి)లు నిలిచారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎ.శివప్రసాద్, న్యాయ నిర్ణేతలు ఆనంద్, షబానా, ప్రణవి, షబీన, యాజమాన్య బృందం దాసరి సురేష్, ఎస్.రాజ్‌కుమార్, ఎస్.కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 24న పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభ

**తిర్యాణి, న్యూస్‌టుడే:** హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో ఈ నెల 24న జరిగే పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి కోరారు. శనివారం తిర్యాణి జూనియర్ కళాశాలలో విద్యార్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు. సభకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు లెనిన్, నాయకులు సుకన్య, భవాని, శ్రావణ్ తదితరులు ఉన్నారు.

## రైతులకు అందుబాటులో ఉంటా..

**నార్నూర్, న్యూస్‌టుడే:** నార్నూర్-గాదిగూడ మండలాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ఉపమార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. సోయా క్వింటాలుకు మద్దతు ధర రూ.4,892 పలికింది. ఖర్చులు పోగా రైతు మిగిలేది రూ.1892 మాత్రమేనని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నార్నూర్ ఉప మార్కెట్ యార్డును ఇంద్రవెల్లి నుంచి వేరు చేసి నార్నూర్-గాదిగూడలను కలుపుతూ నార్నూర్ ప్రత్యేక మార్కెట్ యార్డు మంజూరుకు ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. రైతులకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.

**జైనూర్:** ఇటీవల గాంధీ ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన బాధితురాలిని ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శించారు. శనివారం గ్రామానికి వెళ్లి కుటుంబీకులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అండగా ఉండటంతో పాటు ప్రభుత్వపరంగా ప్రయోజనాలు అందిస్తామని భరోసానిచ్చారు. ఘటనకు కారకులను నిందితుడికి కఠిన శిక్ష పడేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. బాధితురాలికి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయంతోపాటు దుస్తులు అందించారు.


సోయా బస్తా తూకం చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అధికారులు, ప్రతినిధులు

## సంపూర్ణ పారిశుద్ధ్య నిర్వహణ అందరి బాధ్యత

**కాగజ్‌నగర్, న్యూస్‌టుడే :** ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే వీధులన్నీ పరిశుభ్రంగా ఉండాలని, సంపూర్ణ పారిశుద్ధ్యం నిర్వహించేందుకు ప్రజల సహకారం ఉండాలని పురపాలక ఇంజినీర్ డి.ప్రఫుల్‌కుమార్ అన్నారు. సర్‌సిల్క్ ఏరియాలోని దుకాణాల నిర్వాహకులకు పారిశుద్ధ్యంపై శనివారం అవగాహన కల్పించారు. వీధుల్లో చెత్తాచెదారం వేయరాదని, వ్యాపార సముదాయాల నుంచి వచ్చే తడి, పొడి చెత్తను పారిశుద్ధ్య వాహనంలో వేయాలని సూచించారు. పారిశుద్ధ్యం లోపిస్తే రోగాల ప్రబలే ప్రమాదం ఉంటుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.శంకర్, స్పర్శ సోషల్ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ సుందరం, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

**కాగజ్‌నగర్, న్యూస్‌టుడే :** బావితరాలను తీర్చిదిద్దేందుకు విద్యార్థులకు కాలుష్య రహిత భవిష్యత్తుపై బాటలు వేయాలని జాతీయ హరితదళం రీజినల్ కో-ఆర్డినేటర్ బాసిక విద్యాసాగర్ అన్నారు. సర్‌సిల్క్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం 'వ్యర్థాల నుంచి అర్థం' అనే అంశంపై విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థిదశ నుంచే పునర్వినియోగంపై అవగాహన కల్పించడం కోసం జాతీయ హరిత దళం విద్యార్థులతో వారి ఆలోచనలకు అనుగుణంగా ప్రదర్శనలు చేపడుతోందన్నారు. జిల్లాలోని విద్యార్థులు అర్థవంతమైన ప్రాజెక్టులు రూపొందించారని, వారికి సహకరించిన గైడ్ ఉపాధ్యాయులను అభినందించారు. జిల్లా ఇన్‌చార్జి డీఈఓ ఉదయ్‌బాబు మాట్లాడుతూ.. విద్యార్థులు కాలుష్య నివారణపై ఆవిష్కరణలు ఇదే దిశగా తమ మేధస్సు ఉపయోగించాలని అన్నారు. కాగజ్‌నగర్ కస్తూర్బా విద్యార్థులు అమూల్య, ఆకృతిలు ప్రథమ బహుమతి సాధించగా రూ.3 వేలు, సిర్పూర్ జడ్పీఎస్ఎస్ విద్యార్థులు ద్వితీయ బహుమతి రూ.2 వేలు, తృతీయ బహుమతి రూ.వెయ్యితోపాటు పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా కో-ఆర్డినేటర్ కటుకం మధూకర్, మండల విద్యాశాఖ అధికారి వాసాల ప్రభాకర్, నోడల్ అధికారి జాడి దేవాజీ, రిసోర్స్ పర్సన్ మామిడాల తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న జాతీయ హరితదళం రీజినల్ కో-ఆర్డినేటర్ విద్యాసాగర్, అధికారులు

## విద్యాసామగ్రి వితరణ

**పెంచికల్‌పేట్:** చేద్వాయి జడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు రాకేష్ తన సొంత ఖర్చులతో ఆంగ్ల డిక్షనరీలు కొనుగోలు చేసి వితరణ చేశారు. జిల్లాలోనే ఉత్తమ పాఠశాలగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులతో కలిసి కృషి చేస్తున్నామని ఆయన చెప్పారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్ చంద్ర, పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు

# ప్రపంచ పురోగతిలో కృత్రిమ మేధస్సు పాత్ర కీలకం

**కాగజ్‌నగర్, న్యూస్‌టుడే :** ప్రపంచ పురోగతిలో కృత్రిమ మేధస్సు పాత్ర కీలకమని జిల్లా ఇన్‌ఛార్జి విద్యాశాఖ అధికారి ఉదయ్‌బాబు అన్నారు. పట్టణంలోని కాగజ్‌నగర్ డివిజన్ సైన్స్ కేంద్రంలో 'కృత్రిమ మేధస్సు, సంభావ్యతలు, ఆందోళనలు' అనే అంశంపై జిల్లాలోని 8, 10 తరగతి విద్యార్థులకు శనివారం నిర్వహించిన సైన్స్ సెమినార్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలు కృత్రిమ మేధ పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. జిల్లా సైన్స్ అధికారి కటుకం మధూకర్ మాట్లాడుతూ.. కృత్రిమ మేధస్సుకు మానవత, నైతిక విలువలను జోడిస్తే దానికి తిరుగులేదని అభిప్రాయపడ్డారు. ఆసిఫాబాద్ మండలం జన్కాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థి ఐశ్వర్య ప్రథమ బహుమతి, కాగజ్‌నగర్ ఫాతిమా కాన్వెంట్ విద్యార్థి సదా ద్వితీయ బహుమతి, కాగజ్‌నగర్ ఓల్డు ఉన్నత పాఠశాల విద్యార్థి టి.సాయి తృతీయ బహుమతులు సాధించారు. ఆర్థిక గణాంకాల అధికారి జాడి దేవాజీ, మండల విద్యాశాఖ అధికారి వాసాల ప్రభాకర్, న్యాయ నిర్ణేతలు సత్యనారాయణ, భిక్షపతి పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

## మెనూ ఛార్జీలు పెంచాలని వినతి

**దహెగాం:** మధ్యాహ్న భోజన కార్మికుల మెనూ ఛార్జీలు పెంచాలని ఆ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కృష్ణమాచారి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. కనీసం వేతనం రూ.10 వేలు అమలు చేయాలని, కోడిగుడ్లకు అదనపు బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మమత, పార్వతి, సమత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పరిశీలించి.. ఆదేశించి

**కాగజ్‌నగర్, న్యూస్‌టుడే :** కాగజ్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న రెండు పడకగదుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు పాలనాధికారి దీపక్ తివారీ, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధ శుక్లలు అధికారులను ఆదేశించారు. శనివారం వారు రెండు పడకగదుల నిర్మాణాలను పరిశీలించి మాట్లాడారు. సెప్టిక్ ట్యాంకుల నిర్మాణం చేపట్టాలని, ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్తు లైన్ ఏర్పాటు చేయాలని, నీటి వసతి కోసం సంపులు నిర్మించి పైప్‌లైన్ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని ద్వారకానగర్, బారెగూడ శివారు వినయ్‌గార్డెన్స్ సమీపంలో కొనసాగుతున్న ఎల్ఆర్ఎస్ సర్వే తీరును పరిశీలించారు. సర్వేలో నిర్దేశించిన అన్ని అంశాలను పరిశీలించి సర్వే పూర్తి చేయాలని సూచించారు. తహశీల్దార్ కిరణ్, కమిషనర్ అంజయ్య, ఎంపీడీఓ రమేశ్, డీఈ రమాదేవి వారి వెంట ఉన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న అదనపు పాలనాధికారి దీపక్ తివారీ, సబ్ కలెక్టర్

## బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

**ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే :** బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకుల నుంచి ఉత్తర్వులు ఉన్నప్పటికీ సంబంధిత కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయులు రిలీవ్ చేయకుండా వేధిస్తున్నారని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు తౌటం శ్యాంసుందర్ డీఈవో కార్యాలయ ఏడీఏ గమాన్యల్‌కు సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్నారు. జైనూరులో ఎంపీయూపీఎస్ ఉర్దూ మాధ్యమ పాఠశాల ఉపాధ్యాయునికి బదిలీ కాగా ఆయనను అక్టోబరు 15న విడుదల చేయాలని డీఎస్సీ నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. అయినప్పటికీ సంబంధిత కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయులు ఇప్పటి వరకు విడుదల చేయకుండా వేధిస్తున్నారని ఆరోపించారు.

## వర్షం.. రైతుల్లో హర్షం

**కౌటాల, సిర్పూర్(టి), న్యూస్‌టుడే :** ఆరుగాలం కష్టపడి పంటలు పండించే అన్నదాతలకు వర్షాభావం కంటి మీద కునుకు లేకుండా చేసింది. 15 రోజులుగా కురవకపోవడంతో.. మిర్చి, పత్తి, వరి పంటలు ఎండుముఖం పట్టడంతో రైతన్నలు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం కౌటాల, సిర్పూర్(టి) మండలాల్లో భారీ వర్షం పడటంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పంటలకు జీవం పోసినట్లయిందని హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా వేసవిని తలపించేలా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు. సిర్పూర్(టి)లో రాత్రి గంటపాటు విద్యుత్తు అంతరాయం ఏర్పడింది. డోర్‌పల్లి గ్రామంలో చెక్‌డ్యామ్ నిండిపోవడంతో డోర్‌పెల్లి, సోన్లగూడ, కొమ్ముగూడ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

### చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

**దహెగాం, న్యూస్‌టుడే :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్సై కందూరి రాజు సూచించారు. మండలంలోని చిన్నరాస్పల్లి జడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థి ఎన్ఆర్ఐ లింగమూర్తి కుమార్తె సుదీక్ష పుట్టిన రోజు సందర్భంగా పాఠశాలకు క్రీడా దుస్తులు పంపించారు. శనివారం ప్రధానోపాధ్యాయురాలు సునితతో కలిసి 40 మంది విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలని సూచించారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని బాల్యవివాహాలు చేయకూడదని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో వీవో సంఘం అధ్యక్షురాలు సుశీల, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న ఎస్సై కందూరి రాజు

## సంక్షిప్త సమాచారం

### పశు వైద్య శిబిరాలు

**కాగజ్‌నగర్ గ్రామీణం,** మండలంలోని ఆయా గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం కొనసాగుతోంది. శనివారం మండలంలోని చారిగాంలో 328 ఎడ్లు, ఆవులకు టీకాలు వేసినట్టు పశువైద్యాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. వీఏ శైలేందర్, శ్రీనివాస్, గోపాలమిత్ర జమీర్, తదితరులు పాల్గొన్నారు.

**తిర్యాణి:** మండలంలోని ఏదులపాడ్, అరటిపల్లి, దోంఢ్లా గ్రామాల్లో శనివారం పశువైద్య శిబిరాలు నిర్వహించినట్లు పశువైద్యాధికారి సాగర్ తెలిపారు. మూడింటిల్లో కలిపి 782 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సురేష్, మనోహర్, సంతోష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

### కంటి శస్త్రచికిత్సలకు తరలింపు

**కాగజ్‌నగర్:** కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో.. శనివారం 13 మందిని కంటి శస్త్రచికిత్సల కోసం తరలించారు. మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో చికిత్సలు అవసరమని గుర్తించామని, వీరికి బెల్లంపల్లి లయన్స్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా చేయించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. ప్రతి మంగళవారం కిమ్స్ ఆసుపత్రిలో నిర్వహించే ఉచిత కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### అటవీశాఖ ఉద్యోగులకు వైద్య పరీక్షలు

**శ్రీరాంపూర్ గ్రామీణం:** శ్రీరాంపూర్ ఏరియా పరిధిలో విధులు నిర్వహిస్తున్న అటవీ శాఖ ఉద్యోగులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శనివారం ఎస్‌సీఓఏ క్లబ్‌లో డీవైసీఎంఓ డాక్టర్ పి.రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి ప్రారంభించారు. ఉద్యోగులకు గుండె సంబంధిత, ఈసీజీ, వివిధ రకాల రక్త పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, ఆర్కే-6 గని మేనేజర్ తిరుపతి, డాక్టర్ మనీషా, మంచిర్యాల డివిజన్ ఫారెస్టు అధికారి సర్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## జీతాలు ఇవ్వాలని ధర్నా

**రామకృష్ణాపూర్:** మందమర్రి ఏరియా కేకే ఓసీ ఆర్‌వీఆర్ ఓబీ క్యాంపులో పనిచేసే వాహన చోదకులకు రెండు నెలలుగా జీతాలు ఇవ్వట్లేదని నిరసన వ్యక్తం చేశారు. ఓబీ ఎదుట ధర్నా చేపట్టి చెల్లించాల్సిన జీతాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్సై ప్రవీణ్ కుమార్ చేరుకొని ఏరియా జీఎం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## అవగాహనతోనే నియంత్రణ

**ఆసిఫాబాద్:** అవగాహనతోనే హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రించవచ్చని డీఎంహెచ్‌వో తుకారం పేర్కొన్నారు. దిశా కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సదస్సులో పాల్గొని మాట్లాడారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అనంతరం దీనికి సంబంధించిన గోడ ప్రతులు ఆవిష్కరించారు. ఉప వైద్యాధికారులు సిద్ధార్థ, సీతారాం, ఎయిడ్స్ పీవో డా.అజీమ్, దిశ అధికారి నీలిమ, డీఎండీవో సంతోష్, ఐటీసీటీ కౌన్సిలర్‌లు సతీష్, హరీశ్ పాల్గొన్నారు.


గోడ ప్రతులు ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో తుకారం, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది

# సింగరేణి కళాకారులు కోలిండియాలో సత్తా చాటాలి

**గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే:** సింగరేణి ఉద్యోగ కళాకారులు ప్రాంతాల విభేదం లేకుండా ఒకే కుటుంబంలా కళాస్ఫూర్తి చాటాలని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. బెల్లంపల్లి ఏరియా డబ్ల్యూపీఎస్ ఆధ్వర్యంలో గోలేటిలోని సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో మందమర్రి, బెల్లంపల్లి ఏరియా మధ్య నియర్‌బై కల్చరల్ పోటీలు నిర్వహించారు. కళాకారులను ఉద్దేశించి జీఎం మాట్లాడుతూ.. ఉద్యోగం చేసుకుంటూనే మిగతా సమయాల్లో కళా నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు కొంత సమయం కేటాయించుకోవాలని సూచించారు. ఉద్యోగ కళాకారులు కోలిండియా స్థాయిలో రాణించి సింగరేణికి మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శించిన కళాకారులను జీఎం ప్రశంసించారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి బయ్య మొగిళి, డీజీఎం (ఐఈడీ) ఉజ్వల్‌కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి డి. ప్రశాంత్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, డబ్ల్యూపీఎస్ కో-ఆర్డినేటర్ కె.కిరణ్‌బాబు, కళాకారులు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగిస్తున్న బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్

## కళాశాలలో స్వచ్ఛ భారత్

**కాగజ్‌నగర్, న్యూస్‌టుడే :** పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సతీశ్ అన్నారు. శనివారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ అధికారి ప్రకాశ్ అధ్యక్షతన స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి పిచ్చిమొక్కలు తొలగించారు. అనంతరం మొక్కలు నాటారు. విద్యార్థి దశ నుంచే పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోండి

**కాగజ్‌నగర్, న్యూస్‌టుడే :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు చేసుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు సూచించారు. శనివారం పట్టణంలోని పలు వార్డులతోపాటు ప్రైవేట్ పాఠశాలల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రైవేట్ విద్యాసంస్థల్లో విధులు నిర్వహిస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి రూ.10 లక్షల ఆరోగ్య బీమా, జీవిత బీమా కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చిస్తానన్నారు. నిరుద్యోగ భృతితోపాటు ఏటా జాబ్ క్యాలెండర్, ఉద్యోగ నియామకాలు జరిగేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో తనకు మద్దతు తెలపాలని కోరారు. ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పెద్దపెల్లి కిషన్‌రావు, జిల్లా అధ్యక్షుడు దేవభూషణం, ప్రధాన కార్యదర్శి తిరుపతి, కోశాధికారి రాజేంద్రప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ సంజీవరావు, సంయుక్త కార్యదర్శి బరాయి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి చొరవ.. కుటుంబీకుల చేయూత

**రెబ్బెన, న్యూస్‌టుడే:** మండలంలోని తక్కళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కనీస వసతుల కల్పన, విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ కొనుగోలు, పాఠశాల అభివృద్ధికి.. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈదులపల్లి మహేశ్వరరావు చొరవ చూపారు. మొదటగా ఆయన కుటుంబ సభ్యులు స్పందించారు. అమెరికాలో ఉంటున్న ఆయన సోదరి కుమారుడు కోలి భార్గవరావు రూ.లక్ష, రెండో సోదరి కుమార్తె, అల్లుడు శ్వేత-హర్షవర్ధన్ దేశ్‌పాండే నాగరాజ్‌లు రూ.50 వేల చెక్కును అందజేశారు. ఆయన సోదరుడి కుమారుడు డా.సాయిచంద్ర పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ ఇచ్చేందుకు ముందుకొచ్చారు. సింగరేణి ఉద్యోగి కస్తూరి నాగరాజు.. 10 డ్యూయల్ డెస్క్ బెంచీలు సమకూర్చేందుకు ముందుకొచ్చారు.


ప్రధానోపాధ్యాయుడు మహేశ్వరరావుకు చెక్కు అందజేస్తున్న కుటుంబ సభ్యులు

## భాజపా సభ్యత్వ నమోదుకు స్పందన

**కాగజ్‌నగర్ గ్రామీణ, న్యూస్‌టుడే:** సిర్పూరు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లోని ప్రజలు భాజపా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై సభ్యత్వ నమోదుకు ముందుకు వస్తున్నందున మంచి స్పందన లభిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొంగ సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం మండలంలోని గువ్వలగూడ, మోసం, రాస్పెల్లి, బురదగూడ, తదితర గ్రామాల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపట్టారు. ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ యువత పార్టీలో చేరడానికి స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని తెలిపారు. నాయకులు భీమన్‌కర్ గణపతి, పుల్ల అశోక్, బాబురావు, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.


గువ్వలగూడలో.. నమోదు చేయిస్తున్న భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణ

## వ్యాపారపరంగా ప్రోత్సాహం

**ఆసిఫాబాద్, న్యూస్‌టుడే :** మహిళలను వ్యాపార పరంగా ప్రోత్సహించి ఆర్థికంగా బలోపేతం చేసేలా ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు పేర్కొన్నారు. మహిళా శక్తి పథకంలో భాగంగా ఈవెంట్ మేనేజ్‌మెంట్ యూనిట్లను ఎంపిక చేసుకున్న వారికి హైదరాబాద్‌లో గత నెలలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ శిక్షణ నిర్వహించారు. కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్‌కు చెందిన మినతి సర్కార్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ శిక్షణ పొంది వచ్చారు. శనివారం డీఆర్‌డీవో కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి చేతుల మీదుగా శిక్షణ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ, డీపీఎం సారయ్య ఉన్నారు.


మహిళకు శిక్షణ పత్రం అందిస్తున్న డీఆర్‌డీవో దత్తారావు